

క్రీడలకు దూరం 9లో▸

జూనియర్ కళాశాలలో పీడీ పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. జిల్లాలోని దాదాపు అన్ని కళాశాలల్లో ఇదే పరిస్థితి.



ఇక శుభ ఘడియలే 8లో▸

ఈ నెల 19నుంచి వరుస ముహూర్తాలున్నాయి. దీంతో చాలామంది వివాహాలు, గృహప్రవేశాలు, భూమిపూజకు ముహూర్తాలు ఫిక్స్ చేసుకుంటున్నారు.

గరిష్టం/కనిష్టం
32.0/25.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అడ్డి భోజారెడ్డి ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 14ఏళ్ల లోపు బాలబాలికలకు 600 మీటర్ల పరుగు, 16ఏళ్ల లోపు వారికి 800, 2000 మీటర్లు, 18ఏళ్ల లోపు వారికి 800, 1500, 3000 మీటర్లు, 20ఏళ్ల లోపు వారికి 800, 1500, 3000, 5000 మీటర్ల పరుగు పందెం పోటీలు ఉంటాయని తెలిపారు. అలాగే పురుషులు, మహిళలకు 800, 1500, 3000, 5000, 10000 మీటర్ల ఈవెంట్లలో పోటీలు ఉంటాయని, ఆసక్తి, అర్హత కల వారు పుట్టిన తేది ధ్రువీకరణ పత్రాలతో శుక్రవారం ఉదయం 9 గంటలకు స్టేడియంలో రిపోర్ట్ చేయాలని కోరారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారు ఈనెల 20న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

19న 5కే రన్

కైలాస్‌నగర్: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఐ ఓట్ ఫర్ షూర్ అంశంపై ఓటర్లకు అవగాహన కల్పించడంలో భాగంగా ఈ నెల 19న 5కే రన్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో ఉదయం 6 గంటలకు ఈ రన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని యువత, మహిళలు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దరఖాస్తు చేసుకోండి

ఆదిలాబాద్‌రూరల్: అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం ద్వారా విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారి సునీత కుమారి ప్రకటనలో తెలిపారు. ఈ (2023-24) విద్యా సంవత్సరానికి గాను సెప్టెంబర్ 30 వరకు ఈపాస్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మద్యం షాపులకు 53 దరఖాస్తులు

ఆదిలాబాద్‌టౌన్: నూతన మద్యం పాలసీకి సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతుంది. ఇందులో భాగంగా బుధవారం 53 షాపులకు దరఖాస్తులు అందాయి. ఆదిలాబాద్ స్టేషన్ పరిధిలో 38, ఇచ్చోడ స్టేషన్ పరిధిలో 7, ఉట్నూర్ స్టేషన్ పరిధిలో 8 వచ్చాయని డీపీఈవో హేమశ్రీ తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 287 మంది ఆయా షాపుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 18 వరకు దరఖాస్తు గడువు ఉన్నట్లు వివరించారు.

రెగ్యులరైజ్ చేయాలని సెకండ్ ఏఎన్‌ఎంల నిరసన

కైలాస్‌నగర్: తమను రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలు సమ్మెకు దిగారు. ఇందులో భాగంగా బుధవారం రోజువారీ విధులు బహిష్కరించి కలెక్టరేట్ ఎదుట సాయంత్రం ఐదు గంటల వరకు బైఠాయించి తమ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జారీ చేసిన ఎంపీహెచ్ఏ(ఎఫ్) నోటిఫికేషన్ రద్దు చేసి కొన్నేళ్లుగా సేవలందిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సెకండ్ ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

లింగ వివక్షను రూపుమాపాలి



అవగాహన కల్పిస్తున్న యశోద

ఆదిలాబాద్‌టౌన్: లింగ వివక్షను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా సాధికార కేంద్రం కోఆర్డినేటర్ యశోద అన్నారు. పట్టణంలోని బాలికల పాఠశాలలో సఖీ, జిల్లా సాధికార కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాల్య వివాహాలు నిర్మూలించాలని, వరకట్న దురాచారాలను అరికట్టాలన్నారు. ఆడ, మగ తేడా లేకుండా పిల్లలను సమానంగా చూడాలని తెలిపారు. అనంతరం పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మావల మండలం బట్టిసావర్గాంలో పత్తి పంటకు స్ప్రింక్లర్ల ద్వారా నీటిని అందిస్తూ..

వాన జాడేది?



“ ఈ రైతు పేరు కేశవ్‌రెడ్డి. మావల మండలం బట్టిసావర్గాంలో ఎనిమిదెకరాల్లో ఈ సీజన్‌లో పత్తి సాగు చేస్తున్నాడు. గత నెలలో కురిసిన భారీ వర్షాల నుంచి పంట నష్టపోకుండానైతే బయట పడింది. మొక్కలు కొంత ఎదగడంతో రైతు సంతోషించాడు. ఇక ఢోకా లేదనుకున్నాడు. పంట బాగా ఎదగాలని ఇటీవలే కలుపుతీత, ఎరువులు వేసి రసాయన మందులు పిచికారీ చేశాడు. అయితే పక్షం రోజులుగా వర్షాలు లేకపోవడంతో పంట ఎదగలేని పరిస్థితి. ప్రస్తుతం స్ప్రింక్లర్ల ద్వారా నీటిని అందిస్తున్నప్పటికీ మంచి వర్షం పడితేనే పంటకు ఊపిరని అంటున్నాడు ఈయన. జిల్లాలోని అనేక మంది రైతులది ఇదే పరిస్థితి.

- ఆగస్టులో వర్షాభావం
- ఎదుగుతున్న పంటలపై ప్రభావం
- జిల్లాలో పెరిగిన సాధారణ సాగు విస్తీర్ణం

సాక్షి,ఆదిలాబాద్: వరుణుడు మళ్లీ మొఖం చాటేశాడు. ఈ వానాకాలం ప్రారంభమైన తర్వాత జూన్ మాసం పూర్తిగా వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యాయి. దీంతో పంట సాగు ఆలస్యమైంది. జూలైలో మాత్రం ఏకంగా 120 శాతం అధిక వర్షపాతం నమోదు కావడంతో అనేకచోట్ల పంటలు కొట్టుకుపోయాయి. దాని ప్రభావం నుంచి తట్టుకొని నిలబడ్డ పంటల్లో మాత్రం ప్రస్తుతం ఎదుగుదల ఆందోళన కనిపిస్తుంది. ఆగస్టులో ఏకంగా మైనస్ 92 శాతం వర్షం లోటు కనిపిస్తుంది. దీంతో ఎదిగే మొక్కలకు నీటి తడులు అందించేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. కొంత మంది స్ప్రింక్లర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. అవిలేని వారు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి ఉంటే పంటల్లో ఎదుగుదల లోపం ఉంటుందన్న ఆందోళన రైతుల్లో కనిపిస్తుంది.

వర్షపాతం వివరాలు..(మి.మీ.లలో)

నెల	సాధారణ	కురిసింది
జూన్	202.9	86.6
జూలై	325.5	715.3
ఆగస్టు (ఇప్పటివరకు)	163.8	13.8

సాగైన పంటల వివరాలు..(ఎకరాల్లో)

పంట	సాధారణం	సాగైంది
పత్తి	3,76,268	3,85,396
సోయాబీన్	94,445	1,08,522
కందులు	63,256	66,593
ఇతర పంటలు	--	5,859

మించిన సాధారణ సాగు..

జిల్లాలో ఈ వానాకాలం పంటల సాగు సాధారణతో పోల్చితే మించింది. సాధారణ సాగు 5లక్షల 44వేల 920 ఎకరాలు కాగా, జిల్లాలో ఇప్పటివరకు 5లక్షల 66వేల 370 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. 104 శాతంతో సాధారణ సాగు మించింది. అత్యధికంగా పత్తి, ఆ తర్వాత సోయా పంటలు సాగయ్యాయి. ఇవి రెండూ సాధారణ సాగు మించడం గమనార్హం. కందులు సాధారణ సాగుకు సమీపంలో ఉన్నాయి. ఇక మొక్కజొన్న, జొన్న, వరి కూడా సాగైనప్పటికీ మామూలు విస్తీర్ణంలోనే ఉన్నాయి.

అంతరకృషి చేపట్టాలి



ప్రస్తుతం ఉన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఎడ్లతో అంతరకృషి చేపట్టాలి. తద్వారా గాలి ప్రసరణ జరిగి మొక్కలు ఏపుగా పెరిగేందుకు దోహదపడతాయి. అలాగే కలుపు మొక్కల నివారణకు రసాయన మందులను వినియోగించాలి. మొక్కలపై పడకుండా గడ్డిపైనే ఆ రసాయన మందులు పడేలా చూడాలి. రాగల రెండు రోజుల తర్వాత వర్షాలు కురువనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

– డాక్టర్ మోహన్‌దాస్, శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన స్థానం, ఆదిలాబాద్

మేమింతే.. మారమంతే!

“ ఇటీవల జరిగిన కేజీబీవీ నియామకాల్లో జైనథ్ మండలానికి చెందిన ఎస్.రూపాని అనే అభ్యర్థి సీఆర్టీ (సోషల్)గా ఎంపికైంది. ఈమెకు బోథ్ కేజీబీవీ కేటాయిస్తూ విద్యాశాఖ అధికారులు నియామక పత్రం అందజేశారు. జాయినింగ్ కోసం సదరు అభ్యర్థి అక్కడికి వెళ్లింది. అయితే ఇటీవల గాదిగూడ నుంచి సోషల్ సబ్జెక్ట్ సీఆర్టీ పోస్టులో చేరినట్లు అక్కడి ఎస్‌వో ఆమెకు సూచించారు. దీంతో సదరు అభ్యర్థి విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, నార్నూర్‌లో పోస్టు ఖాళీగా ఉందని, అక్కడికి వెళ్లాలని చెప్పారు. ఈ క్రమంలో తనకు అన్యాయం జరిగిందంటూ ఆమె బుధవారం డీఈవోను కలిసి తన గోడు వెళ్లబోసుకుంది.

- ఆదిలాబాద్ పట్టణంలోని ఆర్పీఎల్ పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయురాలు ఓరల్ డిప్యూటేషన్‌పై నార్నూర్ మండలంలోని గంగాపూర్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. విద్యాశాఖాధికారులు సంబంధిత పాఠశాల హెచ్‌ఎంకు ఓరల్‌గా ఫోన్ చేసి ఆమెను డిప్యూటేషన్‌పై పంపించాలని ఆదేశించారు. ఈ పాఠశాలలో 90 మంది వరకు విద్యార్థులు ఉండగా, ప్రస్తుతం వీరి చదువులకు ఆటంకం కలుగుతుంది.
- నార్నూర్ మండలంలోని భీంపూర్ ఉన్నత పాఠశాలలో బోధించే బయోసైన్స్ ఉపాధ్యాయుడిని ఆదిలాబాద్‌రూరల్ మండలం చాందా(టి)కు ఓరల్ డిప్యూటేషన్ కల్పించారు. భీంపూర్ పాఠశాలకు మరో పాఠశాలలో పనిచేసే ఎస్జీటీకి డిప్యూటేషన్‌పై పంపించారు. దీంతో ఉన్నత పాఠశాల విద్యార్థులకు అన్యాయం జరుగుతుంది. భీంపూర్‌తో పాటు సర్దుబాటు చేసిన పాఠశాల విద్యార్థులకు సైతం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే నార్నూర్ మండలంలోని మరో పాఠశాల నుంచి గుడిహత్నూర్ మండలంలోని ఓ పాఠశాలకు ఓరల్ డిప్యూటేషన్ కల్పించారు.



డీఈవో ఎదుట కంటతడిపెట్టిన అభ్యర్థి

- కేజీబీవీ నియామకాల్లో గందరగోళం
- 'సర్దుబాటు'లోనూ నిబంధనలకు తిలోదకాలు
- ఇష్టారీతిన ఓరల్ డిప్యూటేషన్లు
- జిల్లా విద్యాశాఖ తీరిది

ఆదిలాబాద్‌టౌన్: మేమింతే.. మారం.. ఎవరి మాట వినం.. ఎన్ని విమర్శలు వచ్చినా పట్టించుకోం.. నచ్చినట్లే చేస్తాం.. నిబంధనలు గాలికొదిలేస్తాం.. అన్న చందంగా మారింది జిల్లా విద్యాశాఖ తీరు. వీరి చేష్టలతో విద్యార్థులకు అన్యాయం జరుగుతుంది. ఇటీవల ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత మళ్లీ ఓరల్ డిప్యూటేషన్లు కల్పిస్తూ నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు. వారికి అనుకూలంగా ఉన్న టీచర్లకు, రాజకీయ పైరవీలు చేసిన వారికి మేలు చేసేలా వ్యవహరిస్తున్నారు. దీంతో కొంతమంది ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుండగా, విద్యార్థులు సైతం చదువుల పరంగా నష్టపోతున్నారు. ఇటీవల కేజీబీవీ నియామక ప్రక్రియలోనూ గందరగోళం చోటుచేసుకోవడం తెలిసిందే.

అంతా గోల్‌మాల్..

ఇటీవల జరిగిన కేజీబీవీ నియామకాల్లో కెమిస్ట్రీ సబ్జెక్టుకు సంబంధించి ఓ ఉపాధ్యాయ సంఘం నాయకుడి భార్యకు మేలు చేసేలా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. ఆమె సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయకపోయినప్పటికీ తుది జాబితాలో పేరు నమోదు చేయడం గమనార్హం. ఎంపికైన అభ్యర్థి పేరు లేకపోవడంతో బాధితురాలు అధికారులను నిలదీయడంతో విషయం బయటకు పొక్కింది. ఆ తర్వాత ఆ సంఘం నాయకుడి భార్య పేరును తొలగించి అర్హత గల వారికి పోస్టింగ్ కల్పించారు. కేజీబీవీ నియామకాల్లో భాగంగా జిల్లాలో సాంఘిక శాస్త్రం సీఆర్టీలో ఒకే పోస్టు ఉంది. మొదటి ర్యాంక్ వచ్చిన అభ్యర్థి ఎంపికైంది. ఇదిలా ఉండగా గాదిగూడ పోస్టింగ్ ఉన్న ఓ సీఆర్టీ కొన్నేళ్లుగా ఆదిలాబాద్‌లోని కేజీబీవీలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. ఓ ప్రజాప్రతినిధి బంధువు కావడంతో ఇటీవల డైరెక్టరేట్ నుంచి బదిలీ ఉత్తర్వులు తీసుకొచ్చి బోథ్ కేజీబీవీలో చేరారు. నోటిఫికేషన్‌లో మాత్రం బోథ్ కేజీబీవీలో సాంఘిక శాస్త్రం పోస్టు ఖాళీగా ఉన్నట్లు అధికారులు చూపించారు. తీరా ఎంపికైన అభ్యర్థి బోథ్‌కు వెళితే అక్కడ ఆ పోస్టు భర్తీ ఉండడంతో సదరు అభ్యర్థి లబోదిబోమంది. గాదిగూడ కేజీబీవీకి వెళ్లాలని అధికారులు సూచించారు. ఈ క్రమంలో బుధవారం ఆమె డీఈవోను కలిసి కంటతడి పెట్టింది. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అలాగే మావలకు చెందిన మరో అభ్యర్థి శారద కేజీబీవీలో ఖాళీగా ఉన్న నర్సింగ్ పోస్టు కోసం దరఖాస్తు చేసుకుంది. ఆమెకు 5వ ర్యాంక్ వచ్చింది. ఈ అభ్యర్థి ఆసిఫాబాద్ జిల్లాలో 1 నుంచి 4వ తరగతి వరకు చదవగా, మిగతా చదువు ఆదిలాబాద్ జిల్లాలో పూర్తి చేసింది. ఈ పోస్టులో ఆమెను ఆదిలాబాద్ నాన్‌లోకల్‌గా చూపించారు. ఆసిఫాబాద్‌లో పోస్టులు ఖాళీగా ఉన్నా ఆమెకు పోస్టింగ్ దక్కకపోవడతో నష్టపోవాల్సి వచ్చింది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఇలా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంపై పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడుతున్నారు. అలాగే కొంతమంది ఉపాధ్యాయులకు ఎక్కడబడితే అక్కడ ఓరల్ డిప్యూటేషన్లు ఇవ్వడంతో విద్యార్థులు నష్టపోతున్నారు.

పొరపాటు వాస్తవమే..

బోథ్ కేజీబీవీలో పోస్టు ఖాళీగా లేకపోయినప్పటికీ పొరపాటుగా పోస్టు కల్పించాం. ఖాళీగా ఉన్న గాదిగూడ కేజీబీవీలో తిరిగి పోస్టింగ్ ఇచ్చాం. కేజీబీవీల నియామకాలను పకడ్బందీగా చేపట్టాం. అలాగే అవసరం ఉన్నచోట ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టాము. – ప్రణీత, డీఈవో, ఆదిలాబాద్

కుష్ఠు గుర్తింపు సర్వేకు సహకరించాలి

ఆదిలాబాద్‌టౌన్: ఈనెల 16 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వేకు ప్రజలు సహకరించాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. స్థానిక కేఆర్‌కే కాలనీలో గల బస్తీ దవాఖానలో కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు పక్షోత్సవాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శరీరంపై పాలిపోయిన, రాగిరంగు గల మొద్దుబారిన మచ్చలు ఉంటే సర్వేలో భాగంగా ఇంటికి వచ్చే ఆశ కార్యకర్తలకు చూపించాలన్నారు. ఎండీటీతో వ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. ఆలస్యం చేస్తే అంగవైకల్యం కలుగుతుందన్నారు. జిల్లా కుష్ఠు నివారణ అధికారి డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ, సర్వేలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు రాహుల్, డి.శ్రీనివాస్, డీపీఎంలు వామన్‌రావు, మధుసూదన్ రావు, ఎల్టీ రమణచారి, హెల్త్ సూపర్‌వైజర్ సుభాష్, హెల్త్ అసిస్టెంట్లు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

పోలింగ్‌శాతం పెంపుపై ప్రత్యేక దృష్టి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాహుల్ రాజ్

- కలెక్టర్ రాహుల్ రాజ్

కైలాస్‌నగర్: రానున్న ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ నుంచి రాష్ట్ర సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత ఎన్నికల్లో తక్కువగా పోలింగ్ శాతం నమోదైన ప్రాంతాలను గుర్తించామన్నారు. అక్కడ పోలింగ్‌శాతం మెరుగుపరిచేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామన్నారు. ఓటరు లింగ నిష్పత్తి తక్కువ ఉన్న ప్రాంతాల్లో మహిళా ఓటర్ల నమోదుపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలందప్రియ, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాంసి జూనియర్ కళాశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఐఈవో

తాంసి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈవో రవీందర్ బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. బోధన తీరు, ఇతర వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ సుదర్శన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సంతోష్, అధ్యాపకులు ఉన్నారు.

31వ రోజుకు 'డివిజన్' సాధన దీక్ష



దీక్షలో కూర్చున్న విశ్రాంత ఉపాధ్యాయులు

బోథ్: బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన దీక్షలు 31 రోజుకు చేరాయి. బుధవారం నాటి దీక్షలో మండలానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు కూర్చున్నారు. వీరికి పలువురు నాయకులు సంఘీభావం ప్రకటించారు.

వాజ్‌పేయి సేవలు చిరస్మరణీయం

ఆదిలాబాద్: భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో వాజ్‌పేయి వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పలువురు వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ, దేశ హితం కోసం పాటుపడిన గొప్ప నాయకుడు వాజ్‌పేయి అని కొనియాడారు. ఆయన కృషి ఫలితంగానే ఆదిలాబాద్ జిల్లా మీదుగా జాతీయ రహదారి నిర్మాణమైందని వెల్లడించారు. స్థానిక కైలాస్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వర్ధంతి కార్యక్రమంలో సుహాసినిరెడ్డి మాట్లాడుతూ, వాజ్ పేయి సేవలు మరువలేనిమన్నారు. కార్యక్రమాల్లో నాయకులు జోగు రవి, ప్రవీణ్‌రెడ్డి, విజయ్, శివయ్య, తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న శంకర్ తదితరులు

ఈసారికి 'ఇంజినీరింగ్' లేనట్టే!

- జేఎన్టీయూ కాలేజీ ఇస్తామని నిర్మల్ సభలో సీఎం కేసీఆర్ హామీ
- పాలేరు, మహబూబాబాద్‌లలో 300 సీట్ల చొప్పున ప్రారంభం
- ఉమ్మడి జిల్లాకు ఉత్త చెయ్యేనా?



నిర్మల్: గత జూన్ 4న జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటు ఆవశ్యకతపై 'సాక్షి' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. అదేరోజు నిర్మల్ సమీకృత కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి వచ్చిన సీఎం కేసీఆర్‌ను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి జిల్లాకు ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన సీఎం ఉమ్మడి జిల్లాకు జేఎన్టీయూ కళాశాలను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అది ఎక్కడ ఉండాలో మంత్రి నిర్ణయిస్తారని చెప్పారు. ఈ విద్యాసంవత్సరమే తరగతులు ప్రారంభమవుతాయని అప్పట్లో అధికార పార్టీవర్గాలూ పేర్కొన్నాయి. కానీ.. ఇంతవరకు ఆ ఊసే లేకపోవడం నిరాశ కలిగిస్తోంది.

కొత్తగా రెండు ప్రారంభం..

జేఎన్‌టీయూహెచ్ ఆధ్వర్యంలో తాజాగా రెండు కొత్త కళాశాలలు ప్రారంభమయ్యాయి. ఖమ్మం జిల్లా పాలేరు, మహబూబాబాద్‌లో ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించనున్నారు. ఒక్కోచోట సీఎస్ఈ, సీఎస్ఈ (డేటాసైన్స్), ఈసీఈ, ఈఈఈ, మెకానికల్ ఈ ఐదు బ్రాంచీలు మంజూరయ్యాయి. ఒక్కో బ్రాంచీకి 60సీట్ల చొప్పున కాలేజీకి మొత్తం 300సీట్లు కేటాయించారు. ప్రత్యేక విడత కౌన్సెలింగ్ గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఈ విడత ద్వారా కొత్త కాలేజీల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఇక రెండేళ్ల క్రితమే వనపర్తి, సిరిసిల్లలో జేఎన్టీయూ కాలేజీలు ప్రారంభించారు. ఇప్పటికే జగిత్యాల, మంథని, సుల్తాన్‌పూర్‌లో జేఎన్టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాలలు నిర్వహిస్తోంది.

ఇక్కడ అవసరం..

ఇంటర్ పూర్తి కాగానే ఉమ్మడి జిల్లాకు చెందిన చాలామంది విద్యార్థులు ఇంజినీరింగ్ వైపు వెళ్తున్నారు. హైదరాబాద్‌లాంటి దూరప్రాంతాలకు వెళ్లి చదవాల్సి వస్తోంది. ఆర్థికంగా తల్లిదండ్రులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. స్థానికంగా డిగ్రీలో కూడా ఉపాధినిచ్చే ప్రత్యేక కోర్సులు లేకపోవడం, పీజీ కాలేజీ కూడా అందుబాటులోకి రాక తప్పనిసరి పరిస్థితుల్లో విద్యార్థులు దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇక సాఫ్ట్‌వేర్ సంస్థలే జిల్లాల బాట పడుతున్న ప్రస్తుత తరుణంలో స్థానికంగా ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్న వాదన వస్తోంది. సీఎం కేసీఆర్ జిల్లాకు మంజూరు చేస్తున్నట్లు ఇచ్చిన హామీ మేరకు త్వరలో కళాశాల ప్రారంభమయ్యేలా చూడాలన్న డిమాండ్ పెరుగుతోంది.

క్లుప్తంగా

ఇలా.. ఇంటి పన్నుల వసూలు అద్భుతం



ట్విట్టర్‌లో అభినందించిన కేంద్ర మంత్రి

ఇచ్చోడ: డిజిటల్‌ పేమెంట్‌ ద్వారా ఇంటిపన్నులు వసూలు చేయడం అద్భుతమని, నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన ముఖరా(కె) పంచాయతీని కేంద్ర పంచాయతీరాజ్‌ శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌ ట్విట్టర్‌ వేదికలో సర్పంచ్‌ గాడ్గేమీనాక్షిని బుధవారం అభినందించారు. ప్రతీ గ్రామ పంచాయతీలో డిజిటల్‌ పేమెంట్ల ద్వారా వసూలు చేయడానికి కృషి చేయాలని ట్విట్టర్‌లో పోస్టు చేశారు.

మహిళపై కుక్కల దాడి


గాయపడిన మల్లుబాయి

బోథ్‌: మండలంలోని సొనాల గ్రామంలో కుక్కలు స్వైర్య విహారం చేస్తున్నాయి. బుధవారం సాయంత్రం తన ఇంటి ముందు కూర్చున్న బొమ్మేత మల్లుబాయిపై దాడి చేశాయి. దీంతో కాలు చేయిపై గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కాగా గ్రామంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని వాటిని అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇద్దరికి తీవ్రగాయాలు

ఇచ్చోడ: మండలంలోని అడెగామ(కె)లో బుధవారం సాయంత్రం పిచ్చికుక్క దాడి లో కుంట ప్రవీణ్‌, కుంట లస్మన్నలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానిక మాజీ ఉప సర్పంచ్‌ చెన్నల మల్లేశ్‌రెడ్డి వారిని ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో చేర్పించారు.

నీటికుంటలో పడి యువకుడి మృతి

తలమడుగు: ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాలు ప్రకారం.. మండలంలోని అర్లి(కే) గ్రామానికి చెందిన మాధవి శేఖర్‌(22) గ్రామ సమీపంలోని నీటికుంటలో పడి మృతిచెందాడు. శేఖర్‌ కొంతకాలంగా ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. బుధవారం ఉదయం ఇంటి నుంచి కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామ సమీపంలోని నీటికుంట వద్దకు వెళ్లాడు. నీటి కుంట వద్ద ఫిట్స్‌ రావడంతో నీటిలో పడి మృతిచెందాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ధనశ్రీ తెలిపారు.

ఇక శుభఘడియలే..


వివాహం కొరకు వస్త్రాల షాపింగ్‌లో బిజీబిజీగా


బంగారం కొనుగోలు చేస్తున్న కుటుంబసభ్యులు



మోగనున్న పెళ్లి బాజా

- ఈ నెల 19 నుంచి ముహూర్తాలు షురూ..
- కిటకిటలాడుతున్న బట్టల షాపులు
- ఫంక్షన్‌హాళ్ల ముందస్తు బుకింగ్‌లు
- డిసెంబర్‌ చివరివరకు వరుసగా వేడుకలు

నిర్మల్‌ఖిల్లా: వివాహం.. ప్రతి ఒక్కరి జీవితంలో మధురాను భూతి. వధూవరులకు అతిపెద్ద పండుగ. పిల్లల వివాహాలను వైభవంగా అందరూ మెచ్చుకునేలా చేయాలని తల్లిదండ్రుల ఆరాటం.. అందుకే కాస్త ఆలస్యమైనా అన్నీ సవ్యంగా కుదిరాకే పెళ్లిళ్లు చేస్తుంటారు. దాదాపు రెండునెలలపైగా కనిపించని కళ్యాణ వేడుకలు మళ్లీ కాంతులీననున్నాయి. రెండునెలలుగా మూఢం కారణంగా నిలిచిపోయిన పెళ్లిళ్లు, శ్రావణశుద్ధ తదియతో పెళ్లి బాజాలు మోగనున్నాయి. ఇప్పటికే శుభముహూర్తాలు ఫిక్స్‌ చేసుకున్న పెళ్లింటివారు అన్ని ఏర్పాట్లులో నిమగ్నమయ్యారు. ఎక్కడ చూసినా దాదాపు కళ్యాణ మండపాలు ముందస్తుగా బుక్‌ అయిపోయాయి. ఆగస్టు 19వ తేదీ నుంచి వరుస ముహూర్తాలు ఉండడంతో చాలా మంది వివాహాలు, గృహప్రవేశాలు, నిర్మాణ ముహూర్తాలు ఫిక్స్‌ చేసుకుంటున్నారు. ఇక శనివారం నుంచి మంచి ముహూర్తాలు మొదలు కానున్నాయి.

పెళ్లి ముహూర్తాలు ఇవే..

ఆషాఢం, అధిక శ్రావణ మాసంతో 2 నెలల బ్రేక్‌ తర్వాత ఈనెల 19 నుంచి డిసెంబర్‌ 31 వరకు 53 మంచి ముహూర్తాలున్నట్లు పండితులు చెబుతున్నారు. దీంతో వివాహాలు , గృహ ప్రవేశాలు, శుభకార్యాలు జోరందుకోనున్నాయి.

పెళ్లి వేడుకలకు సరికొత్తపోకడలు..

ఇదివరకు పెళ్లిళ్ల అంటే కేవలం బ్యాండ్‌ మేళాలు, భాజాభజంత్రీలు, పూలమండపాలు, వీడియో షూటింగ్‌లు ఇటువంటివి చాలా కామన్‌గా ఉండేవి.. అయితే ఇప్పుడు పూర్తిగా ట్రెండ్‌ మారింది. వివాహ ముహూర్తానికి ముందే సంగీత్‌ కార్యక్రమాలు నిర్వహించడం, ప్రీ వెడ్డింగ్‌ షూట్‌ల కోసం ఇతర లొకేషన్లకు, ప్రకృతి, చారిత్రక ప్రాంతాలకు ఫొటోగ్రాఫర్లతో వధూవరులు వెళ్లడం, సినీ సంగీత విభావరులు ఇలా సరికొత్త ట్రెండ్‌ను ఫాలో అవుతున్నారు. సినిమాటిక్‌గా వధూవరులచే స్పెషల్‌సాంగ్స్‌ రూపకల్పన చేసి అవి ముందుగానే సోషల్‌ మీడియాలో విడుదల చేయడం, కళ్యాణ వేదికపై ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ తెరలపై ప్రదర్శించడం ఇలా విభిన్నంగా వేడుకను నిర్వహిస్తున్నారు.

కొనుగోళ్లతో మార్కెట్‌ కిటకిట...

ప్రస్తుతం ధర పెరిగినా, కళ్యాణ ముహూర్తాలు దగ్గర పడుతుండటంతో బంగారం కొనుగోళ్లు బాగా పెరిగాయి. అంతే కాకుండా వస్త్రదుకాణాలు కూడా కళకళలాడుతున్నాయి. ముహూర్తాలు దగ్గర పడుతున్నవారు అప్పుడు దుకాణాల్లో షాపింగ్‌లు చేస్తూ నిమగ్నమయ్యారు. దీంతో పలు చోట్ల వాణిజ్య సముదాయాలు కళకళలాడుతున్నాయి.

ఎందరికో ఉపాధి...

పెళ్లిళ్లు ఊపందుకోవడంతో పాటు ఇతర అన్ని రకాల శుభకార్యాలకు అనువైన రోజులు కావడంతో వేలాది మందికి ఉపాధి అవకాశాలు మెరుగుపడుతున్నాయి. కల్యాణ మంటపాలు, కేటరింగ్‌, వంటవాళ్లు, పురోహితులు, ఫొటో, వీడియో గ్రాఫర్లకు, ట్రావెల్స్‌ బస్సులు, ఐస్‌క్రీమ్‌, మినరల్‌ వాటర్‌, ఈవెంట్‌ మేనేజ్‌మెంట్లు, పూలు, డెకరేషన్‌, లైటింగ్‌, హోటళ్లు, రెస్టారెంట్లు, లాడ్జీలు, సాంస్కృతిక కళాకారులతో పాటు పలు విభాగాల్లో పనిచేసే కార్మికులకు ఉపాధి లభించనుంది.

ముహూర్తాల తేదీలివే:

ఆగస్టు నెలలో : 19, 20, 22, 24, 26, 29, 30, 31
సెప్టెంబర్‌ నెలలో : 1, 2, 3, 6, 7, 8
అక్టోబర్‌ నెలలో: 18, 19, 20, 21, 22, 24, 25, 26, 27, 31
నవంబర్‌ నెలలో : 1, 2, 8, 9, 16, 17, 18, 19, 22, 23, 24, 25, 28, 29
డిసెంబర్‌ నెలలో : 3, 5, 6, 7, 8, 14, 15, 16, 17, 19, 20, 21, 24, 31.

వరుసగా ముహూర్తాలు



రెండు నెలలుగా ఆషా ఢం, అధిక శ్రావణ మాసాలు రావడంతో శుభ ఘడియలు, పెళ్లి ముహూర్తాలు లేవు. ఇక ఈ నెల 19 నుంచి నిజ శ్రావణమాసం ప్రారంభం కానుండడంతో ఇక పెళ్లిళ్ల సీజన్‌ మొదలుకానుంది. ఈసారి అధిక మొత్తంలో పెళ్లిళ్లు ఉండనున్నాయి. ఈ సంవత్సరం డిసెంబర్‌ నెల వరకు పెళ్లిళ్లకు మంచి ముహూర్తాలు ఉన్నాయి.

– ఎస్‌. శ్రీకాంతాచార్యులు, పురోహితుడు, నిర్మల్‌.

పెళ్లిళ్ల సీజన్‌ మొదలైంది...



పెళ్లిళ్లకు డెకరేషన్లు, మండపం ఏర్పాటు, ఈవెంట్‌ మేనేజ్‌మెంట్‌ చేస్తుంటాను. అయితే ఇన్నాళ్లు ముహూర్తాలు లేక నా వ్యాపారం స్తబ్దంగా సాగింది. ఇక ఈనెల 19 నుండి ముహూర్తాలు ఉన్నట్లు పండితులు వెల్లడిస్తుండడంతో డెకొరేషన్లకు ముందస్తు బుకింగ్‌లు చేసుకుంటున్నారు.

– బి సంతోష్‌, డెకొరేటర్‌, ఈవెంట్‌ మేనేజర్‌

ముగిసిన రెండ్రోజుల శిక్షణ


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు అడే గజేందర్‌

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ప్రైవేట్‌ ఫంక్షన్‌హాల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన రాజీవ్‌ గాంధీ పంచాయతీరాజ్‌ శిక్షణ బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్‌ సంఘటన జిల్లా అధ్యక్షులు అడేగజేందర్‌ మాట్లాడారు. దేశంలో అతిపెద్ద సంస్థల్లో పంచాయతీ రాజ్‌ ఒక్కటన్నారు. పంచాయతీ రాజ్‌ సంస్థ బలోపేతంగా ఉంటే గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతంగా జరుగుతాయన్నారు. ఈ శిక్షణ శిబిరం ద్వారా పంచాయత్‌ రాజ్‌ వ్యవస్థపై రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణ పొందిన అభ్యర్థులు గ్రామాల్లో పంచాయతీ రాజ్‌ సంఘటనపై అవగాహన కల్పిస్తారన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శిబిరానికి ముఖ్యఅతిథిగా పంచాయతీ రాజ్‌ నేషనల్‌ జనరల్‌ సెక్రెటరీ కిరణ్‌ముగబసవ్‌ హాజరయ్యారు. ఏఐసీసీ సభ్యులు నరేష్‌జాదవ్‌, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు మహిమూద్‌ఖాన్‌, మండల పార్టీ అధ్యక్షుడు నారయన్‌రెడ్డి, నాయకులు కుంర కోటేశ్వర్‌, సామన్‌పెల్లి శేఖర్‌, జాహిద్‌ మోహినొద్దిన్‌, ముస్తాఫా, భీమన్న, బాబా పాల్గొన్నారు.

ఒకరి ఆత్మహత్య

కుభీర్‌: ఆర్థిక ఇబ్బందులు తాళలేక తాగిన మైకంలో ఒకరు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై ఎండీ షరీఫ్‌ వివరాల ప్రకారం... మండలంలోని డొడర్నాకు చెందిన పాలేకర్‌ ఔసాజీ (47) రామారావ్‌ అనే వద్ద పాలేరుగా పనిచేస్తున్నారు. మంగళవారం ఉదయం 8గంటలకు చేనుకు వెళ్తానని చెప్పి గుర్తుతెలియని పురుగుల మందు తాగి పడిపోయాడు. అపస్మారకస్థితిలో ఉండగా యజమాని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి భైంసాలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు కుమార్తెలున్నారు. కేసు ఫిర్యాదు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

బాసర రైల్వేలైన్‌కు మహర్దశ

- హైదరాబాద్‌–షిర్డీ డబుల్‌లైన్‌
- నిధులు మంజూరు చేసిన కేంద్రం
- రైలు ప్రయాణం మరింత సౌకర్యవంతం

భైంసా: బాసర రైల్వేలైన్‌కు మహర్దశ పట్టనుంది. ఈ మార్గంలో ప్రయాణం మరింత సౌకర్యవంతం కానుంది. హైదరాబాద్‌ నుంచి షిర్డీ వరకు డబుల్‌ లైన్‌ నిర్మాణానికి కేంద్రం నిధులు మంజూరు చేసింది. ఈ మార్గంలో మేడ్చల్‌ – ముథ్కెడ్‌ వరకు 502.34 కిలో మీటర్లు మేర డబుల్‌లైన్‌ నిర్మాణానికి రూ.5655.40 కోట్ల నిధులు మంజూరు చేసింది.

మరింత సౌకర్యవంతంగా..

డబుల్‌ లైన్‌ నిర్మాణం పూర్తయితే చదువులతల్లి నిలయమైన బాసరకు అటు మహారాష్ట్రలోని షిర్డీకి వెళ్లే యాత్రికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ఎన్నో ఏళ్లుగా ఈ మార్గంలో డబుల్‌ లైన్‌ పనుల కోసం ఎదురుచూస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఈ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా భక్తులు బాసర క్షేత్రానికి రైలు మార్గం ద్వారానే అత్యధికంగా వస్తుంటారు. బాసర ట్రిపుల్‌ఐటీలో ఉండే పదివేల విద్యార్థులు, మూడువేల మంది సిబ్బంది కూడా రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి ఉన్నారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా మరింత సులభంగా రైలుమార్గం ద్వారానే బాసరకు చేరుకోవచ్చు. ఇప్పటి వరకు డబుల్‌ లైన్‌ లేకపోవడంతో గంటల తరబడి క్రాసింగ్‌లతో ప్రయాణానికి ఆలస్యం అవుతోంది.

వందేళ్ల క్రితమే..

వందేళ్ల క్రితమే మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌ నుంచి హైదరాబాద్‌ వరకు నిజాంకాలంలోనే ప్రత్యేక రైల్వే ట్రాక్‌ నిర్మించారు. కానీ ఇప్పటికీ ఈ మార్గం డబ్లింగ్‌కు నోచుకోవడం లేదు. మహారాష్ట్రలో ప్రజాప్రతినిధుల ఒత్తిడి మేరకు నాందేడ్‌ – ముథ్కేడ్‌ వరకు డబ్లింగ్‌ పనులు పూర్తయ్యాయి. సింగల్‌ ట్రాక్‌పైనే రైల్వేల రాకపోకలు కొనసాగుతున్నాయి. దీంతో ఒక్కో స్టేషన్‌లో ఎదురుగా వస్తున్న రైళ్ల క్రాసింగ్‌ కొరకు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుంది. డబ్లింగ్‌ పనులు పూర్తయితే ఈ సమస్య తీరనుంది.

మన ప్రాంతంలో తక్కువే...

జాతీయ సగటుతో పోలిస్తే తెలంగాణలో రైల్వేమార్గం చాలా తక్కువే. ఉత్తర భారత రాష్ట్రాలైన ఉత్తర ప్రదేశ్‌, బీహార్‌, రాజస్థాన్‌, పంజాబ్‌లలో ఎటుచూసిన రైల్వేమార్గాలు ఉన్నాయి. ఆ రాష్ట్రాల ప్రజలందరూ రవాణాపై రైల్వే వ్యవస్థపైనే ఆధారపడుతుంటారు. అదే మన తెలంగాణ రాష్ట్రానికి వచ్చే సరికి రైలుమార్గం చాలా తక్కువ. ఇటీవలే జరిగిన ఆర్‌టీసీ సమ్మెలోనూ వచ్చిరాని బస్సుల్లోనే జనం రాకపోకలు కొనసాగించారు. మరో వ్యవస్థలేక ఇక్కడి వారంతా బస్సులపైనే ఆధారపడుతుంటారు. బస్సులతో పోలిస్తే రైల్వే చార్జీలు 70 శాతం తక్కువగా ఉంటాయి. భైంసా నుంచి హైదరాబాద్‌ వెళ్లాలంటే రూ. 280 బస్సు టికెట్టు అదే రైలుకు వెళ్లితే రూ. 60 చెల్లిస్తే అక్కడికిచేరుకుంటారు. ఇంతటి తక్కువ చార్జీలు ఉన్న రైలుమార్గం మన జిల్లాలో ఎప్పుడు అందుబాటులోకి వస్తుందోనని అంతా ఎదురుచూస్తున్నారు. వంద సంవత్సరాల కిందట నిర్మించిన సికింద్రాబాద్‌ – ఔరంగాబాద్‌ మార్గం ఇప్పటికీ విద్యుదీకరణకు నోచుకోలేదు. ఇప్పటికీ ఇక్కడ ఎలక్ట్రిసిటీ ట్రేన్‌లు లేవు. దీంతో వేగం తక్కువ ఉన్న రైళ్లలోనే జనం ప్రయాణిస్తున్నారు.


బాసర రైల్వే స్టేషన్‌

'పరుగు' మంత్రంతో ఆరోగ్యతంత్రం...

- వందరోజుల్లో 700కిలో మీటర్లు పరుగు పూర్తిచేసిన వైద్యుడు
- ఉదయపు పరుగుతో మంచి ఫిట్‌నెస్‌...
- ఆరోగ్యచైతన్యం కలిగిస్తున్న న్యూరో డాక్టర్‌
- హెచ్‌డీవోఆర్‌ రన్నింగ్‌ ఛాలెంజ్‌లో రికార్డు


సాధించిన మెడల్స్‌తో డాక్టర్‌.బీఎల్‌ఎన్‌ రెడ్డి

నిర్మల్‌ఖిల్లా: ఆయన అనుక్షణం రోగులతో బిజీగా ఉండే ఓ వైద్యుడు.. అయినప్పటికీ నిత్యం ఉదయం రన్నింగ్‌కు ప్రత్యేక సమయం కేటాయిస్తూ ఆరోగ్యచైతన్యం అవసరమని సమాజానికి సందేశాన్ని ఇస్తున్నాడు. ఇందులో భాగంగా రన్నింగ్‌ ఛాలెంజ్‌ను స్వీకరించి 100 రోజుల్లో 772 కిలో మీటర్ల పరుగును పూర్తి చేశాడు. ఆయన పేరు బి.లక్ష్మీనరసింహారెడ్డి, నిర్మల్‌ జిల్లా కేంద్రంలో న్యూరో ఫిజిషియన్‌గా ప్రాక్టీస్‌ నిర్వహిస్తున్నాడు. ఉదయం పరుగును కొనసాగిస్తూ ఆరోగ్యస్ఫూర్తిని నింపుతున్నాడు. పరుగుకున్న ప్రాధాన్యతపై హెచ్‌డీవోఆర్‌ అనే అంతర్జాతీయ వేదిక నిర్వహిస్తున్న 2023 సంవత్సరపు ఛాలెంజ్‌ను స్వీకరించి వంద రోజుల్లో దాదాపు 772 కిలోమీటర్ల మారథాన్‌ పరుగును పూర్తి చేశాడు. 2023లో మోకాలికి శస్త్ర చికిత్స అయిన తర్వాత కోలుకుంటున్న తరుణంలో అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్నా... వాటిని అధిగమించి హెచ్‌డీవోఆర్‌ అనే అంతర్జాతీయ వేదిక ఆధ్వర్యంలో వంద రోజుల రన్నింగ్‌ ఛాలెంజ్‌ 2023లో పాల్గొంటున్న డాక్టర్‌ లక్ష్మీనరసింహారెడ్డి 98 రోజుల్లోనే 772 కిలో మీటర్ల లక్ష్యాన్ని చేరాడు.

సైక్లింగ్‌లో సైతం...

జిల్లాకు చెందిన పలువురు వైద్యులు, మరికొంత మంది ప్రముఖులు కలిసి సైక్లింగ్‌ క్లబ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. వీరు ప్రతినిత్యం ఉదయం కనీసం 30 నుంచి 50కిలో మీటర్ల వరకు జిల్లా కేంద్రం చుట్టుపక్కనగల పరిసర ప్రాంతాల్లో సైక్లింగ్‌ నిర్వహిస్తున్నారు. ఇందులో బీఎల్‌ నరసింహారెడ్డి సైతం వ్యవస్థాపక సభ్యుడిగా కొనసాగుతూ ఆరోగ్య స్ఫూర్తిని రగిలిస్తున్నాడు.

పరుగుతోనే ఆరోగ్యం పటిష్టం..

ఆరోగ్యంగా ఉండాలంటే మన దినచర్యలో పరుగుకు గంట కేటాయిస్తే మంచిదని. ఉదయాన్నే సూర్యుడి కిరణాలు పడి, విటమిన్‌ డి అందుతుంది. నిద్రలేమితో బాధపడేవారికి పరుగు మంచి చిట్కాగా ఉపయోగపడుతుంది. వృద్ధాప్యం త్వరగా దరిచేరదు. రక్త సరఫరా మెరుగుపడుతుంది. రోగనిరోధక శక్తి పెరుగి, జబ్బుల బారిన పడే అవకాశాలు తగ్గుతాయి. పరుగును అలవాటుగా మార్చుకోవాలి.

– డాక్టర్‌ బి.లక్ష్మినరసింహారెడ్డి, న్యూరో ఫిజిషియన్‌, నిర్మల్‌



ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన ఎన్‌క్వాస్‌ బృందం

తాంసి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఢిల్లీకి చెందిన ఎన్‌క్వాస్‌ (నేషనల్‌ క్వాలిటీ అస్యూరెన్స్‌ స్టాండర్డ్‌) బృందం సభ్యులు ప రిశీలించారు. ఎన్‌క్వాస్‌ గుర్తింపులో భాగంగా రెండు రోజుల పాటు తాంసి ఆరోగ్య కేంద్రాన్ని కమిటీ బృందం సభ్యులు పరిశీలిచనున్నారు. దీనిలో భాగంగా మొదటి రోజున బృందం సభ్యులు డాక్టర్‌ వైశాలి, డాక్టర్‌ ఆనంది బిక్షిత్‌ తనిఖీ చేసి వైద్యసేవలను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న సేవలు, రోగులకు కోసం ఏర్పాటు చేసే వసతులు, పారిశుధ్య నిర్వహణ తదితర వాటిని పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలు వారి నే అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు అందించే సే వలు, ప్రసవాలపై ఆరా తీశారు. వైద్య సేవలకు సంబంధించి ఆరోగ్య కేంద్రంలోని వివిధ రికార్డులను, రిపోర్టులను పరిశీలించి పలు విషయాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నేడు కూడా ఆ రోగ్య కేంద్రంలో ఢిల్లీకి చెందిన ఎన్‌క్వాస్‌ బృందం సభ్యులు మరిన్ని వసతులను పరిశీలించనున్నారు. వారి వెంట వైద్యాధికారి శ్రీకాంత్‌, తాంసి వైద్యాధి కారి శ్రావ్య, ఫార్మాసిస్ట్‌ ఇక్బాల్‌, వైద్య సిబ్బంది మే ఘ, శ్రీలత, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న ఎన్‌క్వాస్‌ బృందం సభ్యులు

రోడ్లపైనే పశువులు...




ఆదిలాబాద్‌ పట్టణంలోని రోడ్లపై పశువుల సంచారానికి అడ్డుకట్ట పడటం లేదు. వాటిని కట్టడిచేయకుంటే గోశాలకు తరలిస్తామనే బల్దియా అధికారుల ఆదేశాలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయే తప్ప కార్యరూపం దాల్చడం లేదు. ప్రధాన రాహదారితో పాటు వివిధ కూడళ్లలోని రోడ్లపై పశువులు యథేచ్ఛగా తిరుగుతుండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ద్విచక్రవాహనదారులు రాత్రి వేళల్లో ప్రమాదాల బారీన పడాల్సిన దుస్థితి ఏర్పడుతుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్‌ ఆదిలాబాద్‌

అన్నను చూసేందుకు వెళ్లి అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ఆసిఫాబాద్‌అర్బన్‌: అన్నను చూసేందుకు వెళ్లి తమ్ముడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని హడ్కోకాలనీకి చెందిన షకీల్‌ (20) కాగజ్‌నగర్‌లో ఉన్న తన సోదరుడి ఆరోగ్యం బాగాలేకపోవడంతో చూసేందుకు బుధవారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. వంకులం సమీపంలోకి వెళ్లగానే ఎదురుగా వచ్చిన ఐచర్‌ వ్యాన్‌ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కాగజ్‌నగర్‌ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదం జరిగిన అరగంటసేపు ఎవరూ పట్టించుకోకపోవడంతో చికిత్సకు ఆలస్యం జరిగిందని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మృతదేహానికి ఆసిఫాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఐచర్‌ వ్యాన్‌ డ్రైవర్‌పై రెబ్బెన పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.


షకీల్‌(ఫైల్‌)

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి


వంటలు పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న పీవో

- గాదిగూడ మండలంలో పర్యటించిన ఐటీడీఏ పీవో చాహత్‌ బాజ్‌పాయ్‌
- కేజీబీవీ, శాటిలైట్‌, ఆశ్రమ పాఠశాలల తనిఖీ.. ఝరి ఆస్పత్రి పరిశీలన

నార్నూర్‌: ఏజెన్సీ ప్రాంతంలోని గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాటు ప్రతీ కాన్పు ప్రభుత్వ ఆస్పత్రిలో అయ్యేలా చూడాలని ఐటీడీఏ పీవో చాహత్‌ బాజ్‌పాయ్‌ అన్నారు. బుధవారం గాదిగూడ మండలంలో ఆకస్మికంగా పర్యటించారు. అర్జుని గ్రామంలోని శాటిలైట్‌ సెంటర్‌, ఝరి గ్రామంలోని ఆశ్రమ పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు కస్తూరిబాగాంధీ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు రిజిస్టర్‌, ఉపాధ్యాయుల రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలపై ఆరా తీశారు. పాఠశాలలో మోను, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. కస్తూరిబాగాంధీ పాఠశాలలోని నీటి సమస్యలపై ఆరా తీశారు. ఐటీడీఏ నిధులతో వేసిన బోర్‌వెల్‌ను పరిశీలించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు ప్రహరీ లేక ఇబ్బంది పడుతున్నట్లు పీవో దృష్టికి తీసుకెళ్లారు. ఝరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. గర్భిణులు, బాలింతల వివరాలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్‌ గైర్హాజరుపై ఆరా తీశారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరానికి వెళ్లినట్లు సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలోని అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. గ్రామాల్లో గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సీజనల్‌ వ్యాధుల పై అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలని కోరారు. ఆమె వెంట ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రియాంక, అశోక్‌, హెల్త్‌ సూపర్‌వైజర్‌ అడే సంజయ్‌ ఉన్నారు.

ఒకరు మృతి..

ఆసిఫాబాద్‌అర్బన్‌: జిల్లా కేంద్రంలోని ఎన్‌జీఓస్‌ కాలనీలో నివాసం ఉంటున్న పడోరె తుకారాం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం తాపీమేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న తుకారాం మూడు రోజులుగా కనిపించడంలేదు. బుధవారం ఇంటి సమీపంలో దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి ఇంట్లోకి వెళ్లిచూడగా మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉంది. మృతదేహానికి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

ఓపెన్‌ స్కూల్‌ పరీక్ష ఫీజు చెల్లించాలి

ఆదిలాబాద్‌టౌన్‌: దూరవిద్య విధానం ఓపెన్‌ స్కూల్‌ పదో తరగతి, ఇంటర్మీడియెట్‌ పరీక్ష ఫీజు ఈ నెల 21 నుంచి సెప్టెంబర్‌ 9వరకు ఆన్‌లైన్‌ ద్వారా చెల్లించాలని డీఈవో ప్రణిత, ఓపెన్‌ స్కూల్‌ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్‌ అశోక్‌ తెలిపారు. పదో తరగతి పరీక్ష ఫీజు ప్రతి సబ్జెక్టుకు రూ.100, ప్రాక్టికల్‌కు రూ.100, ఇంటర్మీడియెట్‌ పరీక్ష ఫీజు సబ్జెక్టుకు రూ.150, ప్రాక్టికల్‌కు రూ.150 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.